"కమలా !... ఓ కమలా !.... కమలమ్మ తల్లీ ! .. "

మేడమీద పిట్టగోడ దగ్గర నిలబడి జుట్టు చిక్కుతీసుకుంటున్న నేను తిరిగి చూచాను మెట్లవైపు.

"హాయి శశీ ...నువ్వా ! ... ఏమిటి విశేషాలు ? ..ఈ మధ్య కల్తీలేని సరుకులా బొత్తిగా అపురూపమయిపోయ్యావ్ ఈ రోజేంటి యిలా చుక్కతెగి పడ్డట్టు వూడిపడ్డావ్ ? ...." ఎదురువెళ్ళి ఆహ్వానిస్తూనే అడిగాను,

"అమ్మాయి నీ కవిత్వం వినే తీరిక ప్రస్తుతం నాకులేదు గానీ వెంటనే డ్రెస్ చేసుకురెడీ అవు ... త్వరగా బయలు దేరాలి." అన్నది.


"ఎక్కడికి, ఏమిటి....పూర్వాపరాలు తెలియకుండా బయలుదేరమంటే ఎలానే...."

"ఎక్కడికంటె .... మన శకుంతలా వాళ్ళయింటికి. ఎందుకూ అంటే తనను చూడడానికి ఎవరో పెళ్లివారు వస్తున్నారట అందుకని .... చాలా ?" పరీక్షల్లో

# పెళ్ళిచూపులు

తేజోవతి






విద్యార్థులు పాయింటు పై పాయింట్ జవాబులు వ్రాసినట్లు బుద్ధిగా చెప్పి నవ్వింది శశి.

"సరి సరి! యిదిచాలా బాగుందే!. తనను చూడ్డానికి ఎవరో వస్తుంటే, ఏకాంతంలో చూసి ఆనందించక మన మంతా ఎందుకుట మధ్యలో?" దువ్వెన కున్న జుట్టును తీసి వుండలా చుట్టి. పారేస్తూ అన్నానేన్నేను.

"నేనూ అదే అన్నాను! ఈ శకుంతలను వెదుక్కుంటూ ఓ దుష్యంతుడు వస్తుంటే మధ్యలో మే మెందుకే పానకంలో పుడకల్లా' అంటే, "అయ్యో అనసూయా ప్రియంవదలు లేందే శకుంతలకు అందమేముంది? అని ఎదురుప్రశ్న వేసి 'రేపు సాయంత్రం అయిదింటికల్లా నువ్వు కమలను తీసుకుని మా ఇంటికి రాకపోతే వూరుకునేది లేదు.' అంటూ ఆర్డరు పడేసిందే... అందుకని కొంచెం ముందుగా బయలుదేరి వచ్చాను. కానీ త్వరగా రెడీ అవు... అప్పుడే నాలుగైంది" అంది శశి 'వాచీ' చూసుకుంటూ....

శకుంతలది చిత్రమైన మనస్తత్వం, అది రమ్మన్నాక వెళ్ళకపోతే సాధించి పోస్తుంది. అందుకని. "సరే కానీ.... జడ అల్లుకుని బొట్టు పెట్టుకుని వస్తాను." అన్నాను.

"ఏం చీర మార్చుకోవా?.."

ఈ చీరకేం..చాల్లెద్దూ — ఇంతకూ వాళ్ళు చూడ్డానికి వస్తున్నది వాళ్ళనుగానీ మనల్ని కాదు గదే—" అన్నాను నవ్వుతూ.

"నీ తలకాయ! .... అదికాదు. వెనకటికి యిల్లుచూసి యిల్లాలిని చూడమన్నట్లు, యీ రోజుల్లో 'ఫ్రెండ్స్'ని చూసి పిల్లను చూడమంటున్నారట .... అందుకని మనమూ ముస్తాబవక తప్పదు."

"అయితే-చచ్చాం పో .... ఏ వేళప్పుడు ఏ పెళ్ళివారు వస్తారోనని ముస్తాబైన స్నేహితురాళ్ళతో సహా కొలువు దీర్చి వుండాలంటావు! _"

"మరి అన్నట్లే" అంటూ "పద పద చీరమార్చు" అన్నది.

నేను బొట్టు అదీ పెట్టుకున్న తర్వాత ఓవాయిల్ చీరకట్ట బోయాను. ఆ చీర లాగిపడేస్తూ, "అబ్బబ్బ... కాస్త మంచి చీరకట్టుకోవే తల్లీ....ఈ రోజుల్లో పెళ్ళి చూపుల్లో చాలా తమాషాలు జరుగుతున్న య్యట....కొంపదీసి అతగాడికి నువ్వు నచ్చి, నిన్ను చేసుకుందామనుకొని కూడా నీ చీర చూసి సందేహిస్తే ఏం కాను" వసపిట్టలా వాగుతూనే మరో చీర తీసి చ్చింది.

ఆ చీరకట్టుకుంటూ, "నీ మొహం, మనకా భయంలేదు. మనం ఎంత అంద మైన చీర కట్టుకున్న శకుంతల ముందు నియాన్ లైట్లముందు బుడ్డి దీపాల్లా నే వుంటాం..." అన్నాను.

"అదా నీ ఏడుపు ... ఎలానూ ఛాన్సు వుండదనా యిందాకటి నుంచీ నీసు కారి పోతున్నావ్ దిగులు పడకులే .... అతగాడితో బాటు ఓ ఫ్రెండ్ అంటూ వస్తే అతగాడికంట శకుంతల పడకుండా ఏర్పాట్లు నేచేస్తాగా సరేనా...."

దాని మాటలకు నాకు నవ్వు వచ్చింది "అది కాదే శశీ.... ఆ ఛాన్సేదో నువ్వే చూసుకో రాదా ?" అన్నాను....

"హతోస్మి ! ...ఎంతమాటన్నావ్... అలనాడు ఆ ఘోటక బ్రహ్మచారి ఆ ఆంజనేయుడే వున్నాడు .... ఈనాడు ఘోటక బ్రహ్మచారిణి యీ శశికళాదేవి వున్నది తప్పమ్మా లెంపలేసుకో" ....అన్నది

శశికి పెళ్ళంటే పడదు. వాళ్ళవాళ్ళు ఎన్ని సంబంధాలు చూసినా తిప్పికొట్టే సింది .. పైగా పెళ్ళంటే బానిసత్వమనీ పురుషుడి అధికారానికి తలవొగ్గి వుండా లని. సమానత్వం వుండదని మొత్తానికి పెళ్ళి పేరెత్తితే లెక్చర్లు దంచేది .. అయినా నేను తనిని వుడికించడానికి, "మరే... అలనాటి ఆంజనేయుడి కూడా పెళ్ళయిందంటారు .. సువర్చలో ఎవరోట. ఆయన భార్యపేరు," అన్నాను.

"ఆ ఆంజనేయుడు చేసుకున్నా యీ ఆంజినేయి చేసుకోదే పెళ్ళి....సరేనా, యిక పద" అంటూ బయలుదేరదీసింది.


మేము వెళ్ళేసరికి పెళ్ళివారు యింకా రాలేదు. శకుంతల ముస్తాబై మా కోసం ఎదురుచూస్తోంది. కలవారి బిడ్డేమో దానికి నగలకు, చీరలకూ కొదవేముంది... చక్కని బిస్కీ జార్జెటు చీర, దానిమీదకు మాచ్ అయ్యేలా కెంపుల సెట్టు పెట్టు కుంది. దాన్ని చూస్తె నాకు కళ్ళు జిగేలు మన్నవి... ఇలాంటి పుత్తడి బొమ్మను చూసి ఏ పురుషుడు కాదంటాడు అను కున్నాను.

మమ్మల్ని చూసి శకుంతల చాలా సంతోషించింది.

"మమ్మల్నెందుకే రమ్మన్నావుట ?" అన్నాను దాని మెళ్ళో వున్న నెక్లెసును చూస్తూ.

"జీవిత సహచరుడ్ని ఎంచుకోడంలో నా రెండు కళ్ళకు తోడు మరో నాలుగు కళ్ళు సాయపడతాయని" అంది నవ్వుతూ శకున్త.

ఈ లోపల బయట కారు హారను విన్పించడమూ, శకున్త నాన్నగారు




వాళ్ళను ఆహ్వానించి తీసుకురావటమూ జరిగింది..

ఒక్క పది నిముషాలు పొయ్యాక శకుం వాళ్ళమ్మగారు వచ్చారు, శకుంను తీసుకువెళ్ళడానికి. మమ్మల్ని కూడా రమ్మని సెగచేసింది శకుం.

హాల్లో ముగ్గురు యువకులు కూర్చు న్నారు. వాళ్ళ మధ్యలోవున్న అతడు తెల్లగా అందంగావున్నాడు. ఖరీదైన సూటు. చేతికి డైమండ్ రింగ్.... రిస్టువాచి కూడా గోల్డు ఛెయిన్ వుంది.

శకుం నాన్నగారు "ఇతడేనమ్మా రాజారావుగారు. "అంటూ పరిచయం చేశారు. శకుంతోబాటు మమ్మల్నికూడా ఆయనకు పరిచయం చేశారాయన.

మేము నమస్కారంచేస్తె వూరికే తలాడించి వూరుకున్నాడతడు. అతడికి కుడి ప్రక్కగా కూర్చున్నతడికికూడా యించుమించు అతడి వయసే. మంచి ఒడ్డూ పొడుగూవున్నాడు. బాగా కండలు దేరిన శరీరం. రాజారావు అంత అందంగా లేకపోయినా అతడి కళ్ళలో చురుకుదనం వుంది. మామూలు తెల్లటి పాంటుమీద తెల్లట షర్టు టక్ చేశాడు.

రాజారావుగారు శకుంను ఏవో ప్రశ్నలు వేస్తున్నాడు కొన్ని మాత్రం విన్నాను నేను. "పేరేమిటి. ఎంతదాకా చదువుకున్నారు. ప్యాసయ్యారా? గ్రూపేమిటి? ఏ కాలేజి? పాటలొచ్చా? వస్తే పాడండి." వగైరా వగైరా.

నేను ఆశ్చర్యపొయ్యాను. మా శకుం అన్ని ప్రశ్నలకూ ఓపిగ్గా జవాబు లివ్వడమేకాక, అతడు పాటపాడమనగానే వీణ తెప్పించి, చక్కటి కృతిపాడి విన్పించింది....

అదిపాడుతున్నంతసేపూ తన్మయులై విన్నాము అందరమూ... పాట అయి పోగానే యింకేదో ప్రశ్న అడగబో తున్న రాజారావును ఆపి, అంతదాకా మౌనంగా కూర్చున్న ఆటినోపాల్, (క్షమించాలి, యీ పేరు నేను పెట్టాను)

"రాజా....యిక ఆపరా నాయనా నీ

క్వశ్చనీరు .... మేడమ్ ... అన్నట్లు మే మెవరమో మావాడు పరిచయం చెయ్య లేదు కదూ .... మిమ్మల్ని చూడగానే మ మ్మ ల్ని మర్చిపోయ్యాడులెండి. నా పేరు రామకృష్ణ ... కాలేజీలో లెక్చ రర్ని .. వాడు చ ం ద్ర ం .. స్టేట్ బాంకిలో పుద్యోగం .. మేము ముగ్గురం బి. ఎ. క్లాస్‌మేట్స్ అదీ మా సంగతి .. ఇక ఇప్పటిదాకా మా వాడు మిమ్మల్ని సవాలక్ష ప్రశ్నలు వేశాడు .. ఇప్పుడు మీ రేమన్నా అడగ దల్చుకుంటే అడ గండి మా వాడ్ని .." అన్నాడు ..

పెళ్ళికొడుకు ముఖం కొంచెం నల్లబ డింది .. ఏదో స్నేహితుడివని, నేను మర్చిపోయిన ప్రశ్నలేవన్నా మంటే నువ్వు అడుగుతావని స మ్మ క ం తో తీసుకువస్తే యిదట్రానీ ప్రతాపంఅన్నట్లు మిర్రుమిర్రున చూశాడు రామకృష్ణవైపు.

ఆ చూపును ఖాతరు చేసినటులేదతడు .... చిరునవ్వుతో మా శకున్తవైపు తిరిగి "ఫరవాలేదు ... మీరూ అడగండి కొన్ని ప్రశ్నలు. వాడికి పాట లొచ్చో రావో, వస్తే పాడి విన్పిస్తాడేమో." నవ్వుతూనే అన్నాడు.

అతడి మాటలకు మే మంతా తెల్ల బొయ్యాం. ముఖ్యంగా శకున్త వాళ్ళ నాన్నగారు కొంచెం మొఖం అదోలా పెట్టుకున్నారు. పెళ్ళికొడుకు మొఖం ఆముదం తాగిన వాడిలా వుంది. ఆ మాటలకు శకున్త మాత్రం చిన్నగా తియ్యగా నవ్వి, "మీరెంత దాకా చదువు కున్నారు ? ఎక్కడ చదువు కున్నారు ? లాంటి ప్రశ్నలు మొదలెట్టింది

గుడ్ ;సూట్‌వాలాగారూ యిప్పుడు మీకు యింటర్వ్యూ బిగిన్ అయిందీ .... ఛీర్ అప్ .... అని మనసులో అనుకుని యీ టినోపాల్‌గారు చిచ్చుబుడ్డిలా వున్నాడు. బానేవుంది. ఆ మూడో అత డేమిటి వెలగని మతాబాలా అలావున్నాడు అనుకొని అటు చూశాను. అక్కడ జ రు గు తు న్న ఆ కార్యక్రమంతో తనకేమీ సంబంధం లేనట్లు, ఆ యింట్లో గోడలకు తగిలించిన అందమైన పెయిం టింగ్స్ చూడ్డానికే తనను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు వాటినే చూస్తూ కూర్చు న్నాడు...మామూలు పైజమా, జుబ్బా బాగా పెరిగిన క్రాపు...అతడ్ని చూడగానే నాకు నవ్వొచ్చింది. ఈ శుద్ధ బుద్ధావ తారాన్ని శశిగోల చెయ్యకుండా వూర్కో దే అనిపించీ అటు చూశాను...

శశి అతడివైపే చూ స్తో ం ది. ఆ అయింది బుద్దుడూ నీపని అయిపోయింది రేపు శకున్త పెళ్ళిలో నువ్వు కనిపించా వంటే మా శశి నిన్ను ఏడిపించి నల్ల బొగ్గులు చెయ్యందే వూరుకోదు—అను కున్నాను.

ఈ లోపల మా శకున్త ఆ ప్రశ్నా యీ ప్రశ్నా అడిగి,

"మీరేం ఉద్యోగం చేస్తుంటారండి" అని అడిగింది.

పెళ్ళికొడుకు జ వా బు చెప్పలేదు. ఇంతలో శకున్త నాన్నగారు కల్పించు కుని, "ఆయనకు వుద్యోగం చెయ్యాల్సిన ఖర్మమేమిటమ్మా. వాళ్ళనాన్నగారులక్షలు సంపాదించారు. కాలుమీద కాలు వేసుకు కూర్చుని తిన్నా ఏడు తరాలదాకా తరగని ఆస్థివుంది" అన్నారు.

ఆ మాటతో పెళ్ళికొడుకు కొద్దిగా

పుంజుకొని వూపిరి పీల్చుకున్నాడు... అతడి ముఖంలో కొద్దిగా దర్పం తొంగి చూసినట్లనిపించింది నాకు ఇప్పు డేమి టంటావ్ అన్నట్లు చూశాడతను శక్కు వైపు.

ఆ తర్వాత "యిక వెళ్ళొస్తా"మంటూ లేచాడతడు...శక్కూ నాన్నగారు వాళ్ళను గేటుదాకా సాగనంపి వచ్చారు.

కళకళలాడుతున్న శక్కూ మొఖం చూసి యిక దాని అభిప్రాయాన్ని నేరుగా అడగాల్సిన అవసరం లేదనిపించింది మాకు...అప్పటికే చీకటి పడబోతోంది కాబట్టి మేము వెంటనే బయలుదేరాల్సి వచ్చింది గానీ లేకపోతే శక్కూను గోల గోల చెయ్యకుండా వదలేవాళ్ళమా ?—

పది రోజులు గడిచాయి. ఈ పది రోజుల్లో నాకు శక్కూ వాళ్ళయింటికి వెళ్ళి ఏమైందని అడిగే తీరిక చిక్కలేదు. మా శశి కూడా రాలేదు మా యింటి వైపు.

ఆ రోజు కొంచెం తల దిమ్ముగా వుంటే, చీర కూడా మార్చుకోకుండా అలా పడుకొని వున్నాన్నేను.

"మాసిన చీర కట్టి.... నిడువాకిక కస్తురి బొట్టుపెట్టి— అమ్మా తల్లీ సత్యభామాదేవీ .... ఎవరి మీదమ్మా అలిగి పడుకున్నావ్ ?" అంటు ప్రవేశించింది మా శశి....

"రావే....రా.... ఏమిటే యీ మధ్య మరీ నల్లపూసవై పొయ్యావ్....ఇవ్వాళ మీ యింటికి వద్దామనుకొని కూడా తల నొప్పిగా వుంటే బద్దకించి పడుకొన్నాను" అన్నాను.

"బద్ధకం గిద్ధకం జానతానై ....లే లేచి ముఖం కడిగి చీర మార్చుకో...."అన్నది.

"అబ్బ... నా ప్రాణానికి మళ్ళీ ఎవరి చూపులొచ్చి పడ్డాయి బాబూ...." "పెళ్ళి చూపులు కాదోయ్ పిల్లా .... ఈసారి పిక్చరు చూడ్డానికి రమ్మని, టికెట్స్ రిజర్వు చేయించానని కబురు చేసింది శకుంతల."

"ఓహో శకుంతల కబురు చేసిందా.. వస్తావుండు. అసలు వాళ్ళింటికి వెళ్ళి పెళ్ళి ఎప్పుడో ఏమిటో కనుక్కు వద్దామని అనుకుంటునే వున్నాను...." అని లేచి గబ గబా రెడీ అయ్యాను.

అమ్మతో యిలా పిక్చరుకు వెళుతున్నా మని చెప్పి బయలు దేరాం. మేం వెళ్ళే సరికి శకుంతలరెడీఅయి మాకోసంఎదురు చూస్తోంది.మమల్ని చూడగానే 'ఏమిట్రా యింత ఆలస్యం చేశారు. ఈ రోజు కారు కూడా లేదు రిక్షాల్లో యింత దూరం వెళ్ళేసరికి పిక్చరు కూడా మొద లెడ్తారేమో .... రండి.... రండి...." అంటూతొందరచేసి బయలుదేరింది....

ముగ్గురం థియేటరు చేరే సరికి శక్కూ అన్నట్లు పిక్చరు మొదలు పెట్టారు. చీకట్లో గేటుకీపర్ సీటు చూపిస్తే వెళ్ళి కూర్చున్నాం.... కూర్చో గానే ఆ మసక వెలుతురులో పక్కసీట్లో కూర్చున్న అతడ్ని చూసి, "హల్లో?" అంటూ విష్ చేసింది శక్కూ....

ఎవరా అని చూశాను .... రాజారావు గారి స్నేహితుడు రామకృష్ణ !

అతడు ప్రక్కకు తిరిగి శకుంతలను చూసి మళ్ళీ విష్ చేసి తన సీట్లో కొంచెం సర్దుకు కూర్చున్నాడు— అతడి ప్రక్కన వున్నది ఆనాటి బుద్దుడే అని

గ్రహించడానికి ఎంతో సేపు పట్టలేదు మాకు. అప్పటికే పిక్చరు జరుగుతుండ డంతో మాటల కవకాశం లేకపోయింది మాకు.

ఇంటర్వెల్‌లో అతడు శకుంతలను చూసి నవ్వుతూ, "హార్టీకంగ్రాచ్యులేషన్స్." అన్నాడు.

"సందర్భం చెప్పి చెప్పండి కంగ్రాట్స్" నవ్వుతూ అన్నదిశకున్త...

"అదేం మీకు రాజా లెటర్ వ్రాయలేదా?.... మీకున్నాడా వ్రాసినట్లు వ్రాశాడే నాకు .... అందలేదా ? .... అన్నాడు:

"ఓహో....ఏమని వ్రాశాడేమిటి ?" శకున్త ప్రశ్న.

"ఏముంది అతడికి మీరు నచ్చారట. కొద్ది రోజుల్లోవచ్చి ముహూర్తాలు పెట్టించుకుంటామని రాశాడు."

"ఆఁహా...." అంది చాలా పొడిగా శకుంతల.

ఈలోపల బుద్ధుడుగారు ఎప్పుడుజారుకున్నారో మెల్లిగా అవతలికి జారుకుని మా ముగ్గురికీ మూడు కూల్‌డ్రింక్స్‌తో ప్రత్యక్షమయ్యాడు.

"మిత్రుడు మారేజి సెటిల్ అవబోతున్నందుకు మాఅందరికీ పార్టీయా?" అని అడిగింది శశి.

"ఆఁ....ఆఁ...." అంటూ చిన్నగా నసిగా డతడు.

ఇంతలో రామకృష్ణ, "కాదండీ .... ఇంకనుండీ మా శకుంతలాదేవి గారి ఫ్రెండ్స్ అందరూ మాకూ కావల్సిన వాళ్ళేగదా. ఆ క్రొత్త బాంధవ్యానికి నాందిగా తీసుకోండి." అంటూ మిత్రుడికి సపోర్టు వచ్చాడు.

"అయితే ఆ బాంధవ్యానికి నాందిగా కాకపోతే మాకు కనీసం మంచినీళ్ళు కూడా యిప్పించరన్నమాట." అన్నది శకుంతల.

"ఆఁ అబ్బే.... అదేంకాదు.... అయినా బాంధవ్యం కాకుండా ఎలా పోతుంది." ఎదురు ప్రశ్నవేశాడు రామకృష్ణ.

"అంత ధైర్యంగా ఎలా చెప్పగలుగుతున్నారు ?"

"ఏముంది!... మీకు నచ్చినట్లు మీరు తెలియచెయ్యకపోతే రాజా పురోహితుడు ముహూర్తాలు అనడుగా. వాడికి మీరూ నచ్చితే యిక బాంధవ్యం ఏర్పడకుండా ఎక్కడికి పోతుంది."

"ఓహో. బాగుంది మీ లాజిక్కు." అన్నది శకున్త.

ఈ లోపల లైట్లు ఆరిపొయ్యాయి. మళ్ళీ ఆటమొదలెట్టారు. అందరం సినిమా చూడ్డంలో మునిగిపొయ్యాం. సినిమా అయిపోయింది. హాలు బయటకు రాగానే, "మీ కారు వస్తుందా ? రిక్షా మాట్లాడమంటారా ?" అని అడిగాడు రామకృష్ణ.


కారు రిపేరులోవుంది." అన్నది శకున్త.

"అయితే రిక్షా పిలవమంటారా ?"

"మీరు యీ వూర్లో ఏ పేటలోవుంటున్నారు ?" శకున్త ప్రశ్నించింది.

"అరండల్‌పేట. మిమ్మల్ని రిక్షా ఎక్కించి మేము నడిచివెళ్ళిపోతాంలెండి" అన్నాడు.

"అయితే పదండి, మేమూ వస్తాం. మా యిల్లు మాత్రం ఏమంత దూరం




గనుక" అంటూ నడకసాగించింది శకున్త.

"చంద్రమౌళీ నగర్ యిక్కడుందిట దీనికి. చూడు శశీ వుడ్ బి ఫ్రెండ్‌ను చూడగానే యిది యిలా మారిందేం, రేపు వుడ్ బీని చూస్తే మనల్ని 'ఎవరు మీ' రంటుంది." అన్నానేను శశితో.

శశి నాకు జవాబు చెప్పకుండా మాతో నడుస్తున్న చంద్రంగారివైపు తిరిగి, "మీరుండేది ఎక్కడ ?" అని అడిగింది.

అతడు పేటపేరుచెప్పగానే, "అయితే యింకేం, మా యిల్లు కూడా అటేనండి. మీరు తోడుంటారు కనుక ఫర్వాలేదు." అన్నది శశి.

ఒక్కడుగు ముందు నడుస్తున్న శకున్త పక్కన నడుస్తున్న రామకృష్ణతో, "ఏమండీ నా కొక చిన్న సందేహం." అన్నది.

"ఏమిటండీ అది ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆ రోజు .... ఆ రోజు ... మీరు నన్ను ప్రశ్నలడగమని ఎందుకన్నారు?" కొంచెం చిన్నగానే అడిగింది.

"ఓ అదా—ఏంలేదు—ఇరువురి జీవితాలు ముడివేసుకోవటం కదా—పెళ్ళంటే—అవతలి వారిని గురించి తెలుసుకోవాలనే కుతూహలం యిద్దరికీ ఒక్కరీతిగానే వుంటుంది గదా—అందుకని అన్నాను—"

"మరి—మరి—ఆ రోజు నే నలా అడిగానని—మీ ఫ్రెండ్ ఏమన్నా ఫీలయ్యారా ?"

"ఫీలవడమా ! ఎందుకండీ ?—ఏమో నాతో ఏమీ అనలేదే ?"

"అదిసరే — మీ పెళ్ళిచూపులప్పుడు కూడా మీ శ్రీమతిని ప్రశ్నలడగమని అన్నారా ?" అన్నది శకున్త.

ఆ మాటకు రామకృష్ణ పెద్దగా నవ్వాడు. "నా కింకా పెళ్లికాలేదండి—

దేముడు మేలుచేస్తే మీరూ, మా రాజా వచ్చి నాకు పిల్లను చూసిపెట్టాల్సి వుంటుంది శకుంతలాదేవిగారూ," అన్నాడు,

"ఓహో, పెళ్ళికాలేదా!—మరయితే మీ పెళ్లిచూపులక్కూడా అడగాల్సిన క్వశ్చనీరు మీ ఫ్రెండే ప్రిపేర్ చేసి తెస్తారా?" ఇది శక్కూ ప్రశ్న.

నాకు విసుగొచ్చింది—అబ్బబ్బ—యిది దాని వుడ్‌బి గొడవలో పడి పోయింది—యిక నేనున్నానన్న మాట గూడా గుర్తుండదు అనుకొంటూ మాకు రెండడుగులు వెనక వస్తున్న శశి కోసం ఆగాను—మొత్తానికి మా శశి ఆ బుద్ధ విగ్రహం చేత ఏదో మాట్లాడిసోంది అనుకొన్నాను ..

"అబ్బబ్బ .. ఏమిటే శశీ యీ పెళ్ళి నడకలు?" అన్నాను విసుగ్గా నా కసలే తలనొప్పి ఎక్కువైంది.

"పెళ్ళి నడకలూ!. ఆ మాట అనొద్దని ఎన్నిసార్లు చెప్పాను." కోప్పడింది శశి.

"ఏమండీ. మీకు పెళ్ళంటే యిష్టం లేదా?" బుద్ధుడు వారు అడిగారు.

"పెళ్ళా. నాకసలు యిష్టంలేదండీ. ఒక వేళ వున్నా నల్లగా జెముడి కాకిలా వున్న నన్నెవరు చేసుకుంటారండి." అన్నది శశి.

అయింది యిది ఆ బుద్ధుడు గార్ని ఆటలు పట్టిస్తోంది అనుకున్నానేన్నేను.

"మీరు జెముడికాకిలా వుంటారని ఎవరన్నారు?"

"ముంజేతి కంకణానికి అద్దంకావాలా చంద్రంగారూ?"

"ఒక్క పిసరు చాయ తగ్గినంత మాత్రాన మిమ్మల్ని మీరు అంతగా కించ పర్చుకోడం బాగుశ్చేదండీ. అయినా మనిషికి కావల్సింది మంచి మనస్సుగానీ పైపై రంగులు కావు" అన్నాడు.

శశి జవాబు చెప్పలేదు. ఈ రోజు దాని శాంతం చూస్తుంటే నాకు భూమి తిరగడం మానేస్తుందేమో నన్నంత భయం వేసింది.

ఆ తర్వాత శశి మాట్లాడలేదు....ఈ లోపల మా యిల్లు వచ్చేసింది. రామ కృష్ణగారు శక్కును యింటిదాకా వెళ్ళి దిగబెడదామన్నారు. చంద్రంగారు శశి కళకు తోడుగా వెళ్తానన్నారు. నేను మా యింటికి వెళ్ళిపొయ్యాను. ఇంటికి వెళ్ళ గానే మా అమ్మ శక్కు పెళ్ళి సంగతి అడిగితే కుదిరిందనే విషయం చెప్పాను.

ఆ తర్వాత నేను అనుకోకుండా వూరికి వెళ్ళాల్సి వచ్చింది. మా బావ గారికి వొంట్లో బాగుండక హాస్పిటల్లో చేర్పిస్తే అక్కకు సాయంగా నేను వెళ్ళాను. అక్కడినుండీ తిరిగి వచ్చేసరికి రెండు నెలలు పట్టింది.

వచ్చీరాగానే అమ్మనడిగిన విషయం శకుంతల పెళ్ళికి ఎవరన్నా వచ్చి పిలి చారా ఏమైందని. అమ్మ నాకు తెలియదని చెప్పింది. కనీసం నాకు శుభలేఖ కూడా వెయ్యకుండా పెళ్ళి చేసుకుంది కాబోలని కోపంతో ఆరోజే వెళ్ళాను వాళ్ళింటికి...

శక్కూ మేడమీద వున్నది. దాని ముఖం ఎందుకో పీక్కుపోయినట్లువుంది. నన్ను ఛూడగానే ఒక్కసారి కూర్చొని, "కమలా ఎప్పుడొచ్చావ్?...నీకోకమంచి




గుడ్ న్యూస్" అన్నది ఉత్సాహంగా.

"గుడ్ న్యూస్ కోసమే వచ్చాను. చెప్పు చెప్పు." అన్నాను.

"మన శశిలేదూ. దానికి పెళ్ళి జరగబోతోంది." అన్నది.

"ఆఁ...." అన్నాను ఆశ్చర్యంగా.

"నిజం. పెళ్ళికొడుకు ఎవరనుకున్నావ్ ?"

నేను చెవులప్పగించే వింటున్నాను.

"అప్పుడొచ్చాడు.. చంద్రం ..అతడు అతడేమో మంచి కవీ....ఆర్టిస్టట. దీనికి కొంచెం ఆ పిచ్చివుందిగా. బొమ్మలు అగీయడం నేర్పమని వాళ్ళయింటికి వెళ్ళేదట....అలా అలా పరిచయమయ్యాడట. ఇది పెళ్ళిచేసుకుంటానన్నదే చాలని వాళ్ళ నాన్నగారు వెంటనే ఒప్పేసుకుని మా నాన్నగారితో చెప్పారట."

శకున్ఠ చెబుతుంటే నేను తెల్లబోయ్యాను. ఆ తర్వాత తేరుకొని నెమ్మదిగా అన్నాను. "అదికాదేయిదివరకు మేరేజెస్ ఆర్ మేడ్ యిన్ హెవెన్ అనే వాళ్ళు. ఈ రోజుల్లో అది మార్చి పెళ్ళి చూపుల్లోనే పెళ్ళిళ్ళు కుదిరిపోతాయంటే బాగుంటుందేమో." అంటూ "యింతకూ నీ మ్యారేజి ఎప్పుడు ఫిక్స్ అయిందే" అని అడిగాను.

ఈ లోపల వాళ్ళమ్మగారు పిలిచారు కాఫీ తీసుకుందువు రమ్మని. ఆవిడ ఎప్పుడూ అలా పిలవరు అందుకే ఆశ్చర్యంగా ఆవిడ వెనకాల వెళ్ళాను. క్రింద కెళ్ళాక ఆవిడఅన్నారు నాతో, "అమ్మాయి కమలా... నువొక్కపని చేసిపెట్టాలమ్మా మాకు. అప్పుడు చూసివెళ్ళిన అబ్బాయి ఎప్పుడోరాశాడుఅతడికి నచ్చినట్లు, లగ్గాలు పెట్టి పంపమని. అప్పటి నుండీ మా

శకున్తను అడిగితే యిది దాని అభిప్రాయము చెప్పటం లేదమ్మా। ఇదుగో అదుగో అంటూ ఎన్నాళ్లు గడుపుతాం. ఒక్కగానొక్క పిల్ల. దాని కిష్టం లేక పోతే మేము మాత్రం మెడలు వంచి చేస్తామా ? ఆ రోజు అతడితో వచ్చాడు చూడు రామకృష్ణ. పాపం అతడిప్పటికి చాలాసార్లు వచ్చివెళ్లాడు ముహూర్తాలు పెట్టించి తెలియచెయ్యమన్నా డతడని. ఈ రోజు నువ్వెలాగయినా దాని మనసులో మాట లాగాలమ్మా।" అన్నారు.

నేను ఆశ్చర్యపొయ్యాను ఆ మాటలకు. శకున్త యింత దాకా తన అభిప్రాయం చెప్పలేదంటే నాకు చిత్రమనిపించి సరాసరి పైకి వెళ్ళాను. నెమ్మదిగా పక్కన చేరి శకుంతలను ప్రశ్నించాను. దాని జవాబువిని నేనునిర్ఘాంతపొయ్యాను.

దానికతడ్ని చేసుకోవడం యిష్టం అదుట ! !

క్షణంసేపు ఏం తోచలేదు నాకు. చివరకి అడిగాను. "లక్షణమైన సంబంధం. ఆస్తిలేదా .... అందంలేదా ? ఏమి తక్కువ. ఎందుకు యిష్టంలేదు శకూ?" అని.

"ఎందుకా చెబుతాను విను. ఒకటి అతడికి డబ్బున్నదన్న అహంకారం చాలావుంది. రెండు తాత తండ్రుల సంపాదించింది కూర్చుని కులుకుతూ తినడంతప్ప ఎర్రని ఏగాని సంపాదించడు. మూడు అతడికి భార్య అంటే అర్థాంగికాదు. అతడికి నచ్చిన ఆటబొమ్మ చాలా యింకా చెప్పమంటావా ?" శకూ గొంతు నే,నెన్నడూ విననంత కోపంగా వుంది.

"ఇక చాలు అతడ్ని గురించి చెప్పవద్దుగానీ. నీ మనసులో యింకెవరన్నా వున్నారేమో చెప్పి ఏడవకుండా, ఏమిటే యిలా వైరాగ్యం పెంచుకుని మంచం మీద పడుకుంటే పన్లవుతాయా ?" అన్నాను కోపంగా.

శకున్త కాసేపు మాట్లాడలేదు. ఆ తర్వాత తలవంచుకుని మెల్లగా అన్నది. "నేను చెప్పి లాభం లేదు కమలా... అంతస్థుల తారతమ్యం చూసి మావాళ్లు వొప్పుకోరు." అన్నది మెల్లిగా.

అయిందీ యిదీ శశిలాంటి నిర్వాకం ఏదో చేసింది.... అనుకుంటూ, "అబ్బ ... అతడెవరో చెప్పవే తల్లీ. మీ వాళ్ళతో చెప్పి వొప్పించే భారం నాది" అన్నాను.

"అతడూ....అతడూ .... ఆ రోజు పిక్చరులో కలిసాంచూడు రామకృష్ణ."

"రామకృష్ణా।" అన్నాను ఆశ్చర్యపోతూ.

"అవును కమలా .... అతడికి రాజారావుగారిలా ఆస్థి లేకపోవచ్చు.... అతడంత అందంగానూ వుండక పోవచ్చు కానీ,..నిండైన వ్యక్తిత్వం వుందతడికి. భార్యను తన చేతిలో కీలుబొమ్మగా కాకుండా వ్యక్తిత్వమున్న మనిషిగా చూసుకోగల మంచిమనస్సుంది. కమలా. జీవితం సుఖంగా వెళ్ళిపోవడానికి అది చాలదంటావా?" అన్నది.

నాకుఏంచెప్పాలో తోచలేదు.:....ఇది ఎలా చెప్పాలో వాళ్ళమ్మగారితో తెలియక యివతలకు వస్తుఅంటే, అప్పటి దాకా తలుపు దగ్గర నిలబడ్డారు కాబోలు వాళ్ళమ్మగారు అప్పుడే మెట్లుదిగి వెళ్ళిపోతున్నారు. ●